క్లుప్తంగా...

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మేడ్చల్: బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంతోష్ రాథోడ్ అన్నారు. మేడ్చల్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ ప్రజలకు చెప్పిన విధంగానే జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు.

భూమిపూజలో కపిల్‌దేవ్ సందడి



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ కెప్టెన్ కపిల్ దేవ్

పోచారం: యమ్నంపేట్‌లో నిర్మాణానికి శనివారం జరిగిన భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టీం ఇండియా మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కపిల్ రాకతో ప్రాజెక్టు ఆవరణలో సందడి నెలకొంది. 3 ఎకరాల 30 గుంటల భూమిలో 100 కోట్ల వ్యయంతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మితమవుతున్నాయని నిర్వాహకులు తెలిపారు.

ఎలక్ట్రీషియన్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 18వ వార్డుకు చెందిన ఎలక్ట్రీషియన్ యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ మృతుడి నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లేశ్, రవీందర్, మాజీ వార్డు సభ్యుడు దేవేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పేద యువతి వివాహానికి ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: పేద యువతి వివాహానికి అవుషాపూర్ సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి దంపతులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ నివాసానికి వెళ్లి ఆయన కూతురు వివాహానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

గ్రామస్తుడే హంతకుడు



వివరాలు వెల్లడిస్తున్న శామీర్‌పేట సీఐ సుధీర్‌కుమార్

శామీర్‌పేట్: ఈ నెల 18న మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామ శివారులో సిద్దిపేట జిల్లా, క్షీరసాగర్ గ్రామానికి చెందిన గుడ్ల మల్లేష్ హత్య కేసులో నిందితుడిని శనివారం శామీర్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సుధీర్‌కుమార్ వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా, ములుగు మండలం, క్షీరసాగర్ గ్రామానికి చెందిన బొడ్డు నరేష్, గుడ్ల మల్లేష్, నల్ల బాలేష్ లు కలిసి ఈ నెల 17 న రాత్రి అదే గ్రామంలో మద్యం తాగారు. నల్ల బాలేష్ ఇంటికి వెళ్లగా బొడ్డు నరేష్, గుడ్ల మల్లేష్‌లు మరింత మద్య తాగడానికి ద్విచక్ర వాహనంపై కొల్తూర్‌కు వస్తుండగా మద్యం మత్తులో ఇద్దరి మధ్య గొడవ మొదలైంది. రాత్రి సమయం కావడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. మల్లేష్ తలపై నరేష్ బాదడంతో తీవ్ర రక్తస్రావమై మృతిచెందాడు. చనిపోయాడని నిర్ధారించుకున్న తరువాత నిందితుడు నరేష్ అక్కడి నుండి ద్విక్రవాహనంపై పరారయ్యాడు. శనివారం పోలీసులు నరేషను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకోవడంతో రిమాండ్‌కు తరలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



శామీర్‌పేట్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. శామీర్‌పేట మండలం, లాల్‌గడి మలక్‌పేట గ్రామంలోని దర్గా సమీపంలో ఓ వ్యక్తి మృతి దేహం ఉన్నదని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఎస్సై మునీందర్ తెలిపారు.

ధ్రువపత్రాల కోసం తిప్పలు

- విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ధ్రువపత్రాలు తప్పనిసరి
- ధ్రువీకరణ పత్రాల జారీలో లోపించిన పారదర్శకత
- కుల, ఆదాయ, ఓబీసీ సర్టిఫికెట్ల కోసం మీ–సేవ కేంద్రాలు, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 58 మండలాలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాల (ధ్రువీకరణ సర్టిఫికెట్లు) జారీలో పారదర్శకత లోపిస్తోంది. వివిధ విద్యాసంస్థల్లో విద్యార్థులు ప్రవేశాలు పొందే సమయం కావటంతో ధ్రువీకరణ పత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గ్రేటర్‌తోసహా శివారులో మొత్తంగా (హైదరాబాద్ జిల్లాలో16, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15,రంగారెడ్డి జిల్లాలో27) 58 మండలాలు ఉండగా, కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగుతుంటే.. మరికొన్ని చోట్ల నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితులు క్షేత్రస్థాయిలో కొనసాగుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

◆ పాత ధ్రువ పత్రాలు ..

ధ్రువపత్రాల జారీలో కొందరు తహసీల్దార్లు పాత ధ్రువపత్రాలను జత చేయాలని కోరుతున్నారు. ఉదాహరణకు కమ్యూనిటీ సర్టిఫికెట్ కావాలంటే పాతది జత చేయాలని సూచిస్తున్నారు. అది లేకుంటే కుటుంబంలో ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. లేకుంటే కొత్తవి ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం ఏ పాత ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం లేదు.

◆ నిరాకరణ..

గ్రేటర్‌తోసహా శివారులోని పలు మండలాల్లో ఫ్యామిలీ మెంబర్ (కుటుంబ సభ్యుల) ధ్రువపత్రాలను తహసీల్దార్లు జారీ చేయడం లేదు. కొన్నిచోట్ల మాత్రం మాన్యువల్‌గా ఇస్తున్నారు. ఇవి అన్నిచోట్ల చెల్లటం లేదు. ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలతో న్యాయస్థానాల్లో కేసులు వేస్తున్నారనే కారణంగా వీటి జారీకి రెవెన్యూ అధికారులు విముఖత వ్యక్తంచేస్తున్నట్లు తెలుస్తోంది.

◆ ముందే చేయించాలట..

కుల, ఆదాయ, నివాస, ఓబీసీ తదితర ధ్రువపత్రాల జారీ కోసం మీ– సేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేద్దామంటే..కొందరు నిర్వాహకులు నేరుగా తీసుకోవడం లేదు. ముందుగా ఆఫారాలపై ఆర్ఐతో సంతకం చేయించాలంటున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. దీంతో చేసేదేమీ లేక సదరు అధికారి కోసం తహశీల్దార్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. సంతకం పూర్తయ్యాక మళ్లీ మీ–సేవకు వెళ్లి దరఖాస్తు చేసి, తిరిగి సదరు ఫారాలను తహశీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. వాస్తవంగా ధ్రువపత్రాల నిమిత్తం ఎక్కడైనా మీ– సేవలో దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు ఫారాలపై ముందస్తుగా ఏ అధికారి సంతకం అవసరం లేదు. దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక సదరు ఫారాలను తహశీల్దార్ కార్యాలయంలో అప్పగించాల్సిన బాధ్యత కూడా మీ–సేవ కేంద్రాల నిర్వాహకులు చేయాల్సి ఉంటుంది.

◆ అన్నీ తామై..

మీ–సేవ నుంచి వెళ్లిన దరఖాస్తులను ఆర్ఐ, తహసీల్దార్ లాగిన్లలో ఓకే చేసిన తర్వాత ఆపరేటర్ ఓకే చేయాలి. కానీ అధికారులు పనుల్లో తీరిక లేకుండా ఉండటంతో వాటిని ఆపరేటర్లకు అప్పగిస్తున్నారు. ఇది వారికి కలిసి వస్తోంది. అన్నీ తామై నడిపిస్తున్నారు.

ఆసుపత్రుల్లో సేవలను మెరుగు పరచాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న సేవలపై శనివారం మేడ్చల్ కలెక్టరేట్‌లో వైద్యాధికారులు , సిబ్బందితో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆశ కార్యకర్తల నియామకం, కంటి వెలుగు కార్యక్రమం, వ్యాక్సినేషన్, మాతా ఆరోగ్య సేవల బలోపేతం, బర్త్ ప్లానింగ్ ,టి- డయాగ్నోస్టిక్స్ సేవలపై ఆసుపత్రి వారిగా డీఎంహెచ్ఓ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎస్ఎంలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే, కీసర ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇందిరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తమ ఏఎన్ఎంగా అవార్డు అందజేయగా జిల్లా వైద్యాధికారులు ,మెడికల్ సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నారాయణరావు,ఆనంద్,రఘునాథస్వామి,సరస్వతి,సంధ్య, వేణు గోపాల్‌రెడ్డి,ఈశ్వర్,మంజుల పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సమష్టి చర్యలు చేపట్టాలి



ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: పర్యావరణ పరిరక్షణ కోసం వ్యర్థాలను తగ్గించడం, పునర్వినియోగం, రీసైకిల్ చేయడం తదితర సమష్టి చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ వేమన రెడ్డితో కలిసి ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..వాణిజ్య సంస్థలు ఉపయోగించిన, ఉపయోగించని ప్లాస్టిక్ వస్తువుల, పాత పుస్తకాలు, దుస్తులు, పాదరక్షలు, బొమ్మలు సేకరించి ఇతరులకు అందజేయడమే స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ్ సర్వేక్షణ్ అంబాసిడర్ సిరాజ్, ఆర్పీలు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఎంపీఓ సస్పెండ్

శామీర్‌పేట్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన మూడు చింతలపల్లి ఎంపీఓ సునీతను మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ శనివారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 19న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య మూడుచింతలపల్లి మండలంలో అకస్మికంగా పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 17 నుండి 23 వరకు ప్రతీ గ్రామంలో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే మూడుచింతలపల్లి మండలంలో మాత్రం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఎంపీఓ సునిత పై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు.

బస్తీ దవాఖానాలతో ఎంతో ఉపయోగం



మేడ్చల్ లో బస్తీ దవాఖానాను పరిశీలిస్తున్న చైర్ పర్సన్

మేడ్చల్: పేదలకు చేరువలో వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం బస్తీలలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని కింది బస్తీ, గిర్మాపూర్‌లలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలను ఆమె పరిశీలించారు. రెండింటిని మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు. బస్తీల్లో డాక్టర్లు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పేదల వైద్యం కోసం పెద్ద పీట వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ విజయలక్ష్మీ, కౌన్సిలర్లు భవానీ రాఘవేందర్‌గౌడ్, లావణ్య హన్మంత్‌రెడ్డి, డాక్టర్ కీర్తన తదితరులు ఉన్నారు.

గౌడవెల్లిని సందర్శించిన అడిషనల్ కలెక్టర్ అగస్త్య



గౌడవెల్లి పంచాయతీ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ అగస్త్య

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య శనివారం సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమై గ్రామంలో నిర్వహిస్తున్న పనులపై ఆరా తీశారు. డీఆర్‌డీఏ పద్మజారాణి, ఎంపీడీఓ పద్మావతి,ఎంపీఓ రవినాయక్ వార్డు సభ్యులు ఉన్నారు.

హిందువులందరూ ధర్మం కోసం పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

మేడ్చల్: హిందువులందరూ దేశంలో ధర్మం కోసం పని చేయాలని బీజేపీ మధ్య ప్రదేశ్ రాష్ట్ర ఇంచార్జ్, జాతీయ నాయకుడు మురళీధర్‌రావు, ప్రవచన కర్త మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. శనివారం మేడ్చల్ పట్టణంలోని శ్రీ గార్డెన్ లో భారత్ నీతి ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ హిందూ కాంక్లేవ్ లో వారు పాల్గొని ప్రసంగించారు.దేశం వేల సంవత్సరాల క్రితమే లక్ష్మీ నిలయంగా ఉందనిదేశంలోని ప్రతీ మహిళ వద్ద ఉన్న బంగారం ఎవరి వద్ద లేనంతగా ఉందని వారికి లక్ష్మీ పూజలు చేసే అలవాటు వల్లే సంపద ఉందని ఉన్నారు. హిందూ యువత ప్రసార మాధ్యమాలలో చురుకుగా ఉండాలని అన్నారు. దేవాలయాలు సురక్షితంగా ఉండాలంటే హిందువులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు కొంపల్లి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దుప్పిని కాపాడిన మజీద్‌పూర్ గ్రామస్తులు



అటవీశాఖ అధికారులకు దుప్పిని అప్పగిస్తున్న మజీద్‌పూర్ గ్రామస్తులు

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం, మజీద్‌పూర్ గ్రామంలోకి శనివారం ఓ అడవి దుప్పి ప్రవేశించింది. కుక్కలు తరుముతుండటంతో గ్రామంలోని ఓ పొలం ఫెన్సింగ్ లో ఇరుక్కుపోయింది. సమాచారం అందుకున్న గ్రామసర్పంచ్ మోహన్‌రెడ్డి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. శామీర్‌పేట మండల అటవీశాఖ అధికారులు దుప్పిని రక్షించి శామీర్‌పేటలోని పార్కులోకి తరలించారు.

ఆర్ఆర్ఆర్‌లో అందరూ భాగస్వాములు కావాలి



ఆర్ఆర్ఆర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి, కమిషనర్ వాణిరెడ్డి



ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ స్వామి తదితరులు

కీసర: మేరా లైఫ్–మేరా స్వచ్ఛ షహర్‌లో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ వాణీరెడ్డిలు పిలుపునిచ్చారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో 5వ వార్డు, 17వ వార్డులో ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి , కమిషనర్ వాణిరెడ్డిలు మాట్లాడుతూ ఇళ్లల్లో పేరుకుపోయిన పాడివెత్తకు సంబంధించిన అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువులు, వినియోగంలో లేని దుస్తులు, షాంపూ కవర్ల నుండి పుస్తకం వరకు వస్తువులు ఆర్ఆర్ఆర్‌కేంద్రాల్లో అందజేయడానికి ఈ 15రోజుల పాటు ఆర్ఆర్ఆర్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. పద్మ అనే మహిళ తమ ఇంట్లో ఉన్న 25 కిలోల డ్రైవేస్టను ఆర్ఆర్ఆర్ సెంటర్‌వద్ద అందజేసారు.ఈ సందర్బంగా మున్సిపల్ చైర్మెన్, కమిషనర్లు పద్మను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌ప్రశాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో 9 చోట్ల కేంద్రాల ఏర్పాటు

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీపరిధిలోని వివిధ వార్డుల్లో 9 చోట్ల ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ స్వామి తెలిపారు. శనివారం దమ్మాయిగూడలో ఆర్ఆర్ఆర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఆర్‌జీకే కాలనీ, సుఖీభవ హాస్పిటల్, ఎల్ఎన్ఆర్ కాలనీ సమపంలోగల ఇందిరమ్మ కాలనీ ఫేజ్–2, బృందావన కాలనీ గణేష్ మండపం, అంజనాద్రి నగర్ బానయ్యకట్ట, దమ్మాయిగూడ మెయిన్‌రోడ్డు రోజ్‌గార్డెన్ ఎదురుగా, దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయం సమీపంలో, కుందన్‌పల్లివార్డు ఆఫీస్ , అహ్మద్‌గూడ వార్డు కార్యాలయం వద్ద ఆర్ఆర్ఆర్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

'లవ్ జీహాదిలకు అడ్డాగా మార్చారు'

బీజేపీ నేత మురళీధర్‌రావు

మేడ్చల్: హైదరాబాద్ నగరాన్ని ముష్కరులు లవ్ జీహాదీలకు అడ్డాగా మార్చారని బీజేపీ నేత, ఆపార్టీ మధ్యప్రదేశ్ ఇంచార్జ్ మురళీధర్‌రావు అన్నారు. మేడ్చల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాకిస్థాన్ తో సంబంధాలున్న సంస్థలు హైదరాబాద్‌లో లవ్ జీహాద్, ల్యాండ్ జీహాద్ పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మధ్యప్రదేశ్ పోలీసులు ఏడుగురు ఉగ్రవాదులను పట్టుకోవడాన్ని బట్టే రాజధానిలో ముష్కరుల జాడలు ఎక్కువగా ఉన్నాయని అర్థం అవుతోందన్నారు.

బీఆర్ఎస్‌తోనే సుపరిపాలన: మంత్రి మల్లారెడ్డి



కొండల్ ముదిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి

జవహర్‌నగర్: బీఆర్ఎస్‌తోనే సుపరిపాలన సాధ్యమవుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. శనివారం మంత్రి మల్లారెడ్డి నివాసంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సంక్షేమ పథకాలతో ఎంతో మంది లబ్ధి పొందుతున్నారన్నారు. అనంతరం జవహర్‌నగర్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షులు బాషగోని కొండల్ ముదిరాజ్ జన్మదినోత్సవం సందర్భంగా మంత్రి మల్లారెడ్డి సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు



సొంత నిధులతో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయిస్తున్న గ్రామస్తుడు శ్రీధర్‌రెడ్డి

మేడ్చల్ రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని రామభక్త ఆంజనేయస్వామి ఆలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ హైటెన్షన్ తీగల సమస్య పరిష్కారమైంది. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ తీగలతో వాహనదారులకు ప్రమాదం నెలకొందని గతంలో సాక్షి కథనం ప్రచురించించగా సేవాభావం కలిగిన గ్రామానికి చెందిన గూడూరు శ్రీధర్‌రెడ్డి సమస్యను పరిష్కరించారు. ప్రమాదకర స్థితిలో విద్యుత్ వైర్లు ఉండడం, నిత్యం శామీర్‌పేట్ వైపు వెళ్లే భారీ వాహనాలు తీగలకు తాకేలా మారడంతో గమనించిన గ్రామస్తుడు శ్రీధర్‌రెడ్డి ప్రజలకు విద్యుత్ ప్రమాదం నుండి విముక్తి కల్పించాలని భావించి సుమారు రూ. లక్ష సొంత డబ్బులు వెచ్చించి విద్యుత్ సిబ్బందితో కలిసి నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

మున్సిపల్ అభివృద్ధే ధ్యేయం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్,పాలకవర్గ సభ్యులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి పరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 11,15 వార్డులలో రూ.55 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీరోడ్డు, అండర్ డ్రైనేజీ,పలు నిర్మాణ పనులకు పాలకవర్గ సభ్యులతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మెన్ ప్రభాకర్, కౌన్సిలర్లు బాలరాజు, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అమెరికా వర్సిటీతో ఎస్సార్ విశ్వవిద్యాలయం ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీల ప్రతినిధులు

కీసర: అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నూతన విద్యాభివృద్ధికి అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయమైన యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీతో హనుమకొండ జిల్లాలోని ఎస్సార్ విశ్వ విద్యాలయం ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎస్సార్ విశ్వవిద్యాలయ ప్రో ఛాన్సలర్ మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం రాంపల్లిదాయరలోగల ఎస్సార్ ఐఐటీ (ఎస్సార్ ఇంటర్నేషనల్ ఇన్స్‌ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)ప్రాంగణలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీ ప్రతినిధులు, ఎస్సార్ వర్సిటీ ప్రతినిధులు ఈ ఒప్పంద పత్రాలను అందిపుచ్చుకున్నారు. డాక్టర్ రోజర్ బెస్ట్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సిద్ధం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 65 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట, జీలుగ, జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బాసిత్ అన్నారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జనుము విత్తనాలు 40 కిలోల బ్యాగ్‌కు రూ. 1225, జీలుగ విత్తనాలు 30 కిలోల బ్యాగుకు రూ. 842 రైతులు చెల్లించవలసి ఉంటుందన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు పొందడానికి రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో ఎదులాబాద్ రైతు వేదికలో సంప్రదించాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు వాడకంతో భూసారం, భౌతిక స్థితి, నేలలో పోషక విలువలు పెరగడంతో రసాయన ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న పారిశుద్ధ్య డ్రైవ్

మేడ్చల్: మున్సిపాలిటీలలో చేపట్టిన పారిశుద్ధ్య డ్రైవ్ కార్యక్రమాలు మేడ్చల్ మున్సిపాలిటీలో శనివారం కొనసాగాయి. పట్టణంలోని 3, 14 వార్డులలో మున్సిపల్ అధికారులు, పాలక వర్గం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి డ్రైవ్‌ను నిర్వహించారు. రెండు వార్డులలో కౌన్సిలర్లు దేవరాజ్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డిలు ప్రారంభించగా చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి ప్రారంభించారు. డ్రైవ్‌లో భాగంగా కాలనీలలో రోడ్ల వెంబడి ఉన్న చెత్తను శుభ్రం చేశారు. వార్డులో పర్యటించి నాలాలు, మురికి కాలువలు శుభ్రం చేయించారు. కమిషనర్ త్రిలేశ్వర్‌రావు, డీఈ విజయలక్ష్మీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్,ఆర్‌ఓ రాంచందర్, ఎన్విరార్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



డ్రైవ్‌లో కార్మికులతో చైర్ పర్సన్ దీపికరెడ్డి